వచ్చే నెల 18న శ్రీనివాస సేతు ప్రారంభం

- నగర ప్రజలకు అభివృద్ధి ఫలాలు అంకితం
- టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి


సెగ్మెంట్‌కు పూజలు చేస్తున్న టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి

తిరుపతి తుడా: తిరుపతి స్మార్ట్ సిటీ ప్రాజెక్టులో భాగంగా టీటీడీ భాగస్వామ్యంతో ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న శ్రీనివాస సేతు వంతెన సెప్టెంబర్ 18వ తేదీన ప్రారంభించి నగర ప్రజలకు అంకితం చేయనున్నట్లు టీటీడీ చైర్మన్ భూమన కరుణాకర రెడ్డి స్పష్టం చేశారు. ఫ్లై ఓవర్ తుది దశ పనుల్లో భాగంగా చివరి మూడో సెగ్మెంట్ ఏర్పాటులో చిన్న ప్రమాదం చోటు చేసుకోవడంతో పనుల్లో కొంత ఆలస్యం చోటుచేసుకుంది. ఈ క్రమంలో ఆ చివరి మూడు సెగ్మెంట్ల ఏర్పాటు ప్రక్రియను శనివారం మేయర్ డాక్టర్ శిరీష, కమిషనర్ హరితతో కలిసి టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి పూజలు చేసి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ప్రజల అవసరాలను దష్టిలో ఉంచుకొని ఇప్పటికే మూడు పేజ్‌లలో పనులు పూర్తిచేసి అందుబాటులోకి తెచ్చామన్నారు. చివరి దశ పనులు పూర్తి చేసి నగర ప్రజలకు అంకితం చేస్తామన్నారు. సుమారు రూ.650 కోట్లతో ఫ్లైఓవర్‌ను ఆధునిక పరిజ్ఞానంతో నిర్మించినట్టు తెలిపారు. ఇందులో 67 శాతం నిధులు అందించి టీటీడీ పెద్దన్న పాత్ర పోషించిందన్నారు. శ్రీనివాస సేతు, క్రికెట్ స్టేడియం, డిస్ట్రిక్ట్ ఆర్ట్ స్టూడియో, కమాండ్ కంట్రోల్ సెంటర్, నూతన మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం వంటి ప్రతిష్టాత్మక ప్రాజెక్టులను అభివృద్ధి చేసే భాగ్యం తమకు దక్కిందన్నారు. అభివృద్ధితో నగర ప్రజల రుణం తీర్చుకుంటున్నామన్నారు. టీటీడీ భాగస్వామ్యంతో తిరుపతి మరింత అభివృద్ధి చెందుతుందని పేర్కొన్నారు. నగర అభివృద్ధి కోసం ఇప్పటికే పలు ప్రణాళికలను అమలు చేస్తున్నామని, భవిష్యత్తు అవసరాలను దృష్టిలో ఉంచుకుని మరిన్ని ప్రతిపాదనలు సిద్ధం చేశామన్నారు. ఈ ప్రణాళికలు పూర్తిస్థాయిలో అమలు చేస్తే తిరుపతి దశ, దిశ, రూపు మారుతుందని, దేశ చిత్రపటంలో కొత్త తిరుపతి ఆవిష్కృతం అవుతుందన్నారు. అందరిలా తాము మాయ మాటలు చెప్పడం లేదని, అభివృద్ధి చేసి చూపించాకే ఆధారాలతో మాట్లాడుతున్నామని వివరించారు. తిరుపతి అభివృద్ధిలో ఆధ్యాత్మికత, చారిత్రకత తొణికిసలాడేలా ముందు చూపుతో వెళుతున్నామన్నారు. మేయర్ శిరీష, కమిషనర్ హరిత మాట్లాడుతూ పెండింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేసేందుకు సిబ్బంది రేయింబవళ్లు పనిచేస్తున్నారని వెల్లడించారు. పనులను రోజువారి పర్యవేక్షించి అనుకున్న సమయానికి పూర్తి చేస్తామన్నారు. టీటీడీ ఎస్ఈ నాగేశ్వరరావు, కార్పొరేషన్ ఎస్ఈ మోహన్, ట్రాఫిక్ డీఎస్పీ నరసప్ప, మున్సిపల్ ఇంజినీర్ చంద్రశేఖర్ ఇతర అధికారులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఉపాధి కూలీల సంఖ్యను పెంచండి

పాకాల: మండలంలో ఉపాధిహామీ కూలీల సంఖ్య పెంచాలని ఏపీడీ పద్మలత ఆదేశించారు. ఆమె శనివారం స్థానిక ఉపాధి హామీ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. ఆమె మాట్లాడుతూ గత ఏడాది కంటే ఈ ఏడాది ఉపాధి కూలీల సంఖ్య తక్కువగా ఉండడానికి గల కారణాలు అడిగి తెలుసుకున్నారు. పనుల వద్ద కూలీలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కల్పిస్తున్న సౌకర్యాలను వివరించాలని తెలిపారు. ఎంపీడీవో ప్రభాకర్, ఏపీవో కళ్యాణి పాల్గొన్నారు.

కనుల పండువగా శివపార్వతుల కల్యాణం



పాకాల: స్థానిక ఆనందగిరి కొండపై వెలసిన శ్రీ వల్లీ దేవసేన సమేత సుబ్రమణ్యస్వామి ఆలయంలో శనివారం శివపార్వతుల కల్యాణోత్సవాన్ని కనులపండువగా నిర్వహించారు. శ్రీకాళహస్తీశ్వరస్వామి ఆలయం ఆధ్వర్యంలో శ్రీ జ్ఞాన ప్రసూనాంబ ధర్మప్రచార పరిషత్- ధర్మ ప్రచార మాసోత్సవాల కార్యక్రమంలో భాగంగా స్వామి, అమ్మవార్ల కల్యాణోత్సవాన్ని చేపట్టారు. ఆలయ కమిటీ చైర్మన్ మహాసముద్రం పట్టాభిరెడ్డి, ఈవో మునిశేఖర్, సర్పంచి గౌరీశంకర్‌రాజు, మునిరత్నంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అకడమిక్ కన్సల్టెంట్స్ వినూత్న నిరసన

తిరుపతి సిటీ: ఎస్వీయూలో పనిచేస్తున్న అకడమిక్ కన్సల్టెంట్లు శనివారమూ నిరసన తెలిపారు. అకడమిక్ కన్సల్టెంట్ హోదాను అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా మార్పు చేయాలని కోరుతూ శనివారం శ్రీనివాస ఆడిటోరియం నుంచి క్యాంపస్‌లోని శ్రీ జ్ఞానప్రద వెంకటేశ్వర స్వామి గుడి వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం స్వామివారికి వినతి పత్రం సమర్పించారు. ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్ రెడ్డిపై తమకు నమ్మకం ఉందని, తమ సమస్య లను పరిష్కరిస్తారని పేర్కొన్నారు. సంఘం అధ్యక్ష, ఉపాధ్యక్ష, కార్యదర్శి కల్లూరు కిషోర్‌రెడ్డి, ఐఎస్ కిషోర్, ఆనందఅమృతరాజ్ తదితరులు పాల్గొన్నారు.

న్యాయమూర్తికి సన్మానం


జడ్జి వెంగయ్యను సన్మానిస్తున్న గవర్నమెంట్ ప్లీడర్ మధుసూదన్‌రెడ్డి

తిరుపతి లీగల్: తిరుపతిలోని రాయలసీమ జిల్లాల భూ సేకరణ అథారిటీ కోర్టు న్యాయమూర్తి ఎం.వెంగయ్య శనివారం పదవీ విరమణ చేశారు. ఆయనను ఆ కోర్టు గవర్నమెంట్ ప్లీడర్ ఎల్.మధుసూదన్‌రెడ్డి, కోర్టు సిబ్బంది ఘనంగా సన్మానించారు. ఆయన సేవలను కొనియాడారు. జడ్జి వెంగయ్య గత ఏడాది జనవరి ఏడో తేదీన న్యాయమూర్తిగా బాధ్యతలు స్వీకరించారు.

ర్యాగింగ్‌కు పాల్పడితే కఠిన శిక్షలు


మాట్లాడుతున్న జడ్జి ఏ.సునీత రాణి

తిరుపతి లీగల్: ర్యాగింగ్‌కు పాల్పడితే కఠిన శిక్షలు పడతాయని తిరుపతి అదనపు సీనియర్ సివిల్ జడ్జి ఏ.సునీత రాణి తెలిపారు. పద్మావతి మహిళా వర్సిటీ ఇంజినీరింగ్ కళాశాలలో శనివారం తిరుపతి మండల న్యాయ సేవ అధికార సంస్థ ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ తల్లిదండ్రులు ఎంతో కష్టపడి పిల్లలను చదివిస్తుంటారని తెలిపారు. తెలిసీ తెలియక తప్పులు చేస్తే జీవితం తీవ్రంగా నష్టపోవాల్సి ఉంటుందన్నారు. కార్యక్రమంలో మహిళా వర్సిటీ ఇంజినీరింగ్ కళాశాల డైరెక్టర్ మల్లికార్జునరావు, న్యాయవాది వజ్రాల చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

పైడిపల్లిలో ఆత్మీయ పలకరింపునకు విశేష స్పందన


పైడిపల్లిలో గడప గడపకూ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరిస్తున్న చెవిరెడ్డి లక్ష్మి

తిరుపతి రూరల్: ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి సతీమణి లక్ష్మి శనివారం తిరుపతి రూరల్ మండలం పైడిపల్లిలో గడప గడపలో ఆత్మీయ పలకరింపు కార్యక్రమం చేపట్టారు. ఆమెకు గ్రామస్తులు మంగళ వాయిద్యాలు, కర్పూర హారతులతో అపూర్వ స్వాగతం పలికారు. గడప గడపలో ఆత్మీయంగా పలకరించి, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలో ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు, కరోనా కష్టకాలంలో తమకు చేసిన సేవలను వివరిస్తూ గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేశారు. చెవిరెడ్డి లక్ష్మి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించి కరపత్రాలు అందజేశారు. ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి చేసిన సేవలను గుర్తు పెట్టుకుని వచ్చే ఎన్నికల్లో తన బిడ్డ, వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి, తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్ రెడ్డిని చంద్రగిరి ఎమ్మెల్యేగా ఆదరించి ఆశీర్వదించాలని ఆమె కోరారు.

ఎమ్మెల్యే పెళ్లి కానుక పంపిణీ



చంద్రగిరి: మండలంలోని దోర్నకంబాల పంచాయతీ మల్లయ్యపల్లికి చెందిన వైఎస్సార్ విద్యార్థి విభాగం మండల అధ్యక్షుడు సురేష్(సూరి), అనూషకు వివాహం నిశ్చయమైంది. వారికి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి పంపిన పెళ్లి కానుకను శనివారం వైఎస్సార్ సీపీ డివిజన్ అధ్యక్షుడు పసల నాగరాజు, నాయకులతో కలిసి అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ గౌతమి, ఉప సర్పంచ్ మురళిరెడ్డి, సోను పాల్గొన్నారు.

బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి సీఎం జగన్


మాట్లాడుతున్న సురేంద్ర

తిరుపతి కల్చరల్: బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి సీఎం జగన్ అని నాయీ బ్రాహ్మణ సేవా సంఘం తిరుపతి నగర అధ్యక్షుడు సురేంద్ర తెలిపారు. ఆయన శనివారం ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో మాట్లాడారు. ఇప్పటి వరకు ఏ రాజకీయ పార్టీ కూడా నాయీ బ్రాహ్మణులకు టీటీడీ పాలక మండలిలో స్థానం కల్పించలేదన్నారు. నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్‌గా ఉన్న సిద్దవటం యానాదయ్యకు టీటీడీ పాలక మండలి సభ్యుడిగా అవకాశం కల్పించి నాయీ బ్రాహ్మణులకు పెద్ద పీట వేసిన ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌కు కృతజ్ఞతలు తెలిపారు. నాయీ బ్రాహ్మణ సేవా సంఘం రాష్ట్ర కార్యదర్శి ఆవుల పాటి బుజ్జిబాబు, నాయకులు భాస్కర్, నాగరాజు, తాతారావు, మల్లికార్జున, వెంకటేష్ పాల్గొన్నారు.

అలరించిన ప్రత్యేక ప్రతిభావంతుల సాంస్కృతిక కార్యక్రమాలు


అద్భుత నృత్యాలతో ఆకట్టుకుంటున్న ప్రత్యేక ప్రతిభావంతులు


తిరుపతి కల్చరల్: ప్రేరణ స్ఫూర్తితో ప్రత్యేక ప్రతిభావంతులు తమదైన నృత్యాభినయం, గానాలాపనతో ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. ప్రేరణ హెల్పింగ్ సొసైటీ 16వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం రాత్రి మహతి కళాక్షేత్రంలో ప్రత్యేక ప్రతిభావంతుల నృత్య, గానాలాపన, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కుటుంబ వ్యవస్థలోని అన్నదమ్ముల బంధాలు, పల్లెసీమల్లోని జన జీవన విధానాలు, మాతృమూర్తి ఔదార్యం, మారుతున్న కాలానికి అనుగుణంగా మారుతున్న మానవ జీవన శైలి తదితర అంశాలతో కూడిన నృత్యాలను ప్రదర్శించారు. గేట్ కళాశాల చైర్మన్ తమ్మినేని వెంకటేశ్వర్లు ప్రేరణ హెల్పింగ్ సొసైటీ ప్రతినిధుల కృషిని, ప్రత్యేక ప్రతిభావంతుల సృజనాత్మకతను కొనియాడారు. కార్యక్రమంలో ప్రేరణ హెల్పింగ్ సొసైటీ ప్రతినిధులు రాజశేఖర్, వెన్నెల, దిగ్విజయ్, తరుణ్, గణేష్, వర, హేమ, పూర్ణిమ, తేజ, రేవతి, శిరీష పాల్గొన్నారు.

వచ్చే నెల మలేషియాకు పద్మావతి మహిళా వర్సిటీ వీసీ


మహిళా వర్సిటీ వీసీ డి.భారతి

తిరుపతి సిటీ: పద్మావతి మహిళా వర్సిటీ వీసీ భారతిని యూనివర్సిటీ మలేషియా కెలన్‌టన్ (యూఎంకే) ఆహ్వానించింది. ఈ మేరకు ఆమె ఈ నెల 29న మలేషియా బయలుదేరనున్నారు. ఈ సందర్భంగా ఆమె శనివారం మీడియాతో మాట్లాడుతూ యూఎంకే మలేషియా వర్సిటీతో పద్మావతి మహిళా యూనివర్సిటీ బయెటెక్నాలజీ, సైన్స్ అండ్ టెక్నాలజీ కోర్సుల అభివృద్ధిలో భాగంగా బోధన, వృత్తి నైపుణ్యం, ఉపాధి అవకాశాలు తదితర విషయాలపై ఎంఓయూ కుదుర్చుకోనున్నట్లు తెలిపారు. అనంతరం మలేషియాలోని మరో యూనివర్సిటీ ఆఫ్ మలేషియా టెరింగను (యూఎంటీ)ని సందర్శించనున్నట్లు తెలిపారు. తేనెటీగల పెంపకంపై ఆ యూనివర్సిటీలో అమలు చేస్తున్న విధానాలను పరిశీలించనున్నట్లు తెలియజేశారు.

నేడు మూడుతరాల మనిషి భూమన్ పుస్తకావిష్కరణ



తిరుపతి కల్చరల్: రచయిత, సామాజిక వేత్త, ప్రకృతి ప్రేమికుడైన భూమన్ కృషికి స్ఫూర్తిగా రూపొందించిన మూడు తరాల మనిషి భూమన్ పుస్తకాన్ని ఆదివారం ఆవిష్కరించనున్నట్టు మానవ వికాస వేదిక కన్వీనర్లు సాకం నాగరాజు, శైలకుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. పాత వేంకటేశ్వర థియేటర్ వద్దనున్న ఎస్ఆర్ కన్వెన్షన్ హాల్లో ఆదివారం ఉదయం 9.20 గంటలకు సభ నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు. నందలూరు వద్దనున్న ఈదర పల్లె భూమన్ పుట్టిన ఊరు. జయరామిరెడ్డి, లక్ష్మమ్మ దంపతుల సంతానంలో మూడో వారు. తండ్రి ఉద్యోగరీత్యా తిరుపతిలో స్థిరపడ్డారు. భూమన్ తిరుపతిలోనే విద్యాభ్యాసం పూర్తి చేసి అధ్యాపక వృత్తిలో ప్రవేశించారు. రాడికల్ విద్యార్థి సంఘం, విప్లవ రచయితల సంఘాల్లో క్రియాశీలకంగా పనిచేశారు. ఎమర్జెన్సీ కాలంలో అరెస్ట్ అయి జైలు జీవితం గడిపారు. రాయలసీమ నీటి వనరుల కోసం జరిగిన పాదయాత్రలో ఎంవీ.రమణారెడ్డి, వైఎస్.రాజశేఖరరెడ్డి తదితరులతో పాల్గొన్నారు. ఆయన కృషికి స్ఫూర్తిగా రూపొందించిన పుస్తక ఆవిష్కరణలో పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

ఘనంగా ఫిట్ ఇండియా

తిరుపతి సిటీ: ప్రముఖ హాకీ క్రీడాకారుడు ధ్యాన్‌చంద్ జయంతి సందర్భంగా ఎస్వీ వ్యవసాయ కళాశాలలో శనివారం జాతీయ క్రీడా దినోత్సవాన్ని ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో ఘనంగా జరుపుకున్నారు. కళాశాల అసోసియేట్ డీన్ జి.ప్రభాకర రెడ్డి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఆరోగ్య సూత్రాలను పాటించాలన్నారు. రోజూ వ్యాయామం చేయాలని సూచించారు. అనంతరం సిబ్బంది, విద్యార్థులు ఫిట్ ఇండియా ప్రతిజ్ఞ చేశారు. ఉద్యోగులకు, విద్యార్థులకు క్రీడా పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. ఎన్ఎస్ఎస్ అధికారులు రెడ్డిశేఖర్, సరళ, సంతోష్, వ్యాయామ విద్య విభాగం ప్రొఫెసర్ రవికాంత్‌రెడ్డి, రాజేశ్వరి, చంద్రిక, రమణ పాల్గొన్నారు.

వైభవంగా మహాలక్ష్మీ అమ్మవారి పుష్పయాగం


గ్రామంలో ఊరేగుతున్న మహాలక్ష్మీ అమ్మవారు

రామచంద్రాపురం: మండలంలోని నడవలూరులో వెలసిన కోదండ రామస్వామి ఆలయంలో శ్రీ జగన్మంగళ సౌభాగ్య దేవతా మహాలక్ష్మీ వ్రత మహోత్సవంలో భాగంగా శనివారం పుష్పయాగం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారిని సుప్రభాతంతో మేల్కొలిపి స్నపన తిరుమంజనం, సహస్ర నామార్చన చేశారు. విశేషంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. అనంతరం అమ్మవారి ఉత్సవమూర్తిని రథంపై కొలువుదీర్చి గ్రామంలో ఊరేగించారు. సర్పంచి గణపతిరెడ్డి, నెన్నూరు డివిజన్ అధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ నేతలు యోగానంద రెడ్డి, కేశవులురెడ్డి, దినకర్‌రెడ్డి, రాజేష్‌రెడ్డి, కృష్ణమూర్తి రెడ్డి, పరశురాం రెడ్డి, గంగరామిరెడ్డి, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

మురుగు గుంతలో పడి వ్యక్తి మృతి

తిరుపతి రూరల్: మండలం గాంధీపురం పంచాయతీ తిరుమలనగర్ మొదటి క్రాస్‌లో రోడ్డు పక్కన ఉన్న మురుగు గుంతలో పడి గుర్తు తెలియని వ్యక్తి(45) మృతి చెందిన సంఘటన ఆలస్యంగా శనివారం వెలుగులోకి వచ్చింది. అతను రెండు రోజుల క్రితం గుంతలో పడి మృతి చెందాడు. శనివారం గుంతలో నుంచి శవం పైకి తేలడంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. రూరల్ ఎస్ఐ పూర్యానాయక్ అక్కడికి చేరుకుని శవాన్ని వెలికి తీయించి తిరుపతి ఎస్వీ మెడికల్ కళాశాల మార్చురీకి తరలించారు.

28 నుంచి తెప్పోత్సవాలు

కార్వేటినగరం: ఈ నెల 28 నుంచి 30వ తేదీ వరకు టీటీడీ ఆధ్వర్యంలో వేణుగోపాల స్వామి తెప్పోత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ అధికారి సురేష్ కుమార్ తెలిపారు. ఆయన శనివారం విలేకరులతో మాట్లాడారు. 28వ తేదీ ఉదయం కోదండరామ స్వామికి స్నపన తిరుమంజనం, సాయంత్రం 4 గంటలకు తిరువీధి ఉత్సవం ఉంటుందన్నారు. 29వ తేదీ ఉదయం రుక్మిణీ, సత్యభామ సమేత వేణుగోపాల స్వామికి స్నపన తిరుమంజనం, సాయంత్రం 4 గంటలకు వేణుగోపాలుని తిరువీధి ఉత్సవం జరుగుతుందన్నారు. 30వ తేదీ ఉదయం స్నపన తిరుమంజనం, సాయంత్రం 4 గంటలకు గ్రామోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహిస్తామన్నారు.

వైభవంగా మహారథోత్సవం

పుత్తూరు రూరల్: పుత్తూరు శ్రీద్రౌపదీదేవి సమేత శ్రీధర్మరాజులస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. చివరి అంకంలోని రెండవ రోజైన శనివారం విజయోత్సవాన్ని చాటుతూ పాండవులు నిర్వహించిన మహారథోత్సవం మహాభారతాన్ని కనులముందు ఆవిష్కరింపజేసింది. గజ, తురగ, పదాతులు వెంట నడువగా, మంగళ వాయిద్యాలు, బాణసంచా నడుమ, ముందు భాగాన శ్రీకృష్ణ రథం నడువగా వెనక మహారథోత్సవం వైభవంగా జరిగింది. 40 అడుగుల మహారథానికి ఇరువైపులా వందలాది మంది భక్తులు గోవింద నామస్మరణతో రథాన్ని లాగారు. ఉదయం 6 గంటలకు బ్రహ్మోత్సవాల ప్రత్యేక అర్చకులు హిమాచలంబాబు, మోహన్ ఆధ్వర్యంలో స్థానిక మంచినీళ్ల గుంట నుంచి సంరక్షకుడిగా పోతురాజు ముందు నడుస్తుండగా గెరిగె ఆలయానికి చేరుకుంది. అనంతరం శ్రీద్రౌపదీదేవి సమేత ధర్మరాజులును విశేషంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. ఉదయం 11 గంటలకు గరుడ వాహనంపై శ్రీకృష్ణుడు రాయభారం కోసం తరలివెళ్లే ఘట్టం భక్తులను ఆకట్టుకుంది. మధ్యాహ్నం 3 గంటలకు భీముడు దుశ్శాసనున్ని వధించిన రక్తంతో ద్రౌపదీదేవి కురులను తడిపే ఘట్టం అలరించింది. అనంతరం దుర్యోధనున్ని సంహరించడం, విజయోత్సాహంతో రథాన్ని అధిరోహించే ఘట్టాలు ఉద్రూతలూగించాయి. పుత్తూరు పట్టణ కమ్మ సంఘం ఆధ్వర్యంలో తిరువీధుల్లో రథంపై విహరించిన ద్రౌపదీదేవి సమేత పాండవ రాజులు ఆలయానికి చేరుకున్నారు. మహారథం ముందు శ్రీకృష్ణ రథంపై పాండవుల వేషధారణ, విజయోత్సవ విన్యాసాలు అలరించాయి. కార్యక్రమాలను ఆలయ కమిటీ చైర్మన్ లారీమోహన్, సభ్యులు ముకుందప్రకాష్, సెల్వరాజ పిళ్లై, మునిరాజ, లక్ష్మీసుధ, నిర్మల, మహాదేవి, ఆలయ నిర్వాహకులు సాల్వాకం ఏలుమలైమొదలి, పళనిమొదలి, గోపిమొదలి, పెరుమాళ్‌మొదలి, కుప్పుస్వామి మొదలి పర్యవేక్షించారు.

నేడు అగ్నిగుండ ప్రవేశం..

ఉదయం 6 గంటలకు గెరిగె ఊరేగింపు, 9 గంటలకు కల్పవృక్ష వాహనం, 10 గంటలకు ఉత్సవం, సాయంత్రం 6 గంటలకు అగ్నిగుండ ప్రవేశం ఉంటుందని ఆలయ నిర్వాహకులు తెలిపారు.

టీటీడీ చైర్మన్‌కు సత్కారం


టీటీడీ చైర్మన్ భూమనను కలిసిన స్విమ్స్ డైరెక్టర్ ఆర్‌వీ కుమార్


పులివెందుల వైఎస్సార్ సీపీ నాయకుడు వైఎస్ మదన్మోహన్ రెడ్డి, వైఎస్ మాధవీలత తదితరులు

తిరుపతి తుడా / తిరుపతి మంగళం: టీటీడీ చైర్మన్ భూమన కరుణాకర రెడ్డిని శనివారం పులివెందుల వైఎస్సార్ సీపీ నాయకుడు వైఎస్ మదన్మోహన్ రెడ్డి, వైఎస్ మాధవీలత, వెంకటేశ్వర ఆయుర్వేద కళాశాల సూపరింటెండెంట్ డాక్టర్ రేణుదీక్షిత్, డాక్టర్ విజయభాస్కర్ రెడ్డి కలిశారు. అనంతరం భూమనను సత్కరించారు. అదే విధంగా స్విమ్స్ డైరెక్టర్‌గా నియమితులైన డాక్టర్ ఆర్‌వీ. కుమార్ టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు.

సీఎం చిత్ర పటానికి పాలాభిషేకం


సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న నాయీ బ్రాహ్మణ సంఘం నేతలు

తిరుపతి కల్చరల్: రాష్ట్ర నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ సిద్దవటం యానాదయ్యను టీటీడీ పాలక మండలి సభ్యుడిగా నియమించిన ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డికి నాయీ బ్రాహ్మణులు కృతజ్ఞతలు తెలిపారు. వారు శనివారం బాలాజీ కాలనీలోని పూలే విగ్రహం వద్ద సీఎం జగన్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ టీటీడీ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా ముఖ్యమంత్రి నాయీ బ్రాహ్మణునికి పాలక మండలి సభ్యుడి స్థానం కల్పించారని తెలిపారు. ఆయనకు అందరమూ రుణపడి ఉంటామని పేర్కొన్నారు. కార్యక్రమంలో తిరుపతి నాయీబ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు గుండ్లూరు మహేష్, నాయకులు రవిచంద్ర, సురేష్, పలపతి, పవన్, కమల్, నాగార్జున, ఆంజనేయులు పాల్గొన్నారు.

వేడుకగా మహాభారత ఉత్సవాలు


కొటాల చంద్రశేఖర్ రెడ్డి దంపతులను సత్కరిస్తున్న నిర్వాహకులు

చంద్రగిరి: స్థానిక పాతపేటలోని ద్రౌపది సమేత ధర్మరాజులు ఆలయం వద్ద ఈ నెల 10వ తేదీ నుంచి చేపట్టిన మహా భారత ఉత్సవాలు అంగరంగ వైభవంగా సాగుతున్నాయి. శనివారం రాత్రి వీరాభిమన్యు పద్మవ్యూహ ప్రవేశం నాటకాన్ని కళాకారులు అద్భుతంగా ప్రదర్శించి రక్తి కట్టించారు. కురుక్షేత్ర యుద్ధంలో అర్జునుడు లేని సమయంలో పాండవులను హతమార్చాలని కౌరవులు పన్నాగం పన్నుతారు. ఈ క్రమంలో పద్మవ్యూహం అమలుచేస్తారు. తల్లి గర్భంలోనే పద్మవ్యూంలోకి ఎలా ప్రవేశించాలో తెలుసుకున్న అభిమన్యుడు కౌరవులను మట్టుబెట్టడానికి వెళ్లి వీరమరణం పొందుతాడు. ఈ ఘట్టాన్ని కళాకారులు అద్భుతంగా నటించి ప్రేక్షకుల మన్ననలు అందుకున్నారు. ఈ కార్యక్రమానికి వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు కొటాల చంద్రశేఖర్ రెడ్డి, కొటాల పంచాయతీ అధ్యక్షుడు విరూపాక్షి ప్రసాద్ రెడ్డి ఉభయదాతలుగా వ్యవహరించారు.

శరవేగంగా అభివృద్ధి పనులు


పనులను పరిశీలిస్తున్న కమిషనర్ హరిత

తిరుపతి తుడా: తిరుపతి నగరంలో చేపట్టిన అభివృద్ధి పనులను శరవేగంగా జరిగేలా చర్యలు తీసుకుంటున్నట్టు మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ హరిత తెలిపారు. ఆమె శనివారం మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయ నూతన భవన నిర్మాణ పనులను పరిశీలించారు. పనులను వేగంగా పూర్తి చేయాలని ఇంజినీర్లు, కాంట్రాక్ట్ సంస్థ ప్రతినిధులను ఆదేశించారు. ఆమె మాట్లాడుతూ స్మార్ట్ సిటీ ప్రాజెక్టులో భాగంగా చేపట్టిన మల్టీ లెవెల్ కార్ పార్కింగ్, డిస్ట్రిక్ట్ ఆర్ట్ స్టూడియో, జిమ్, ఇండోర్ స్టేడియం, క్రికెట్ స్టేడియం పనులను ఆరు నెలల్లో పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామన్నారు. మాస్టర్ ప్లాన్ రోడ్లు, ఫ్రీ లెఫ్టులు, కూడళ్ల విస్తరణ తిరుపతి నగరానికి పెద్ద తలమానికంగా ఉండనున్నట్టు తెలిపారు. టీటీడీ పరిపాలన భవనం దక్షిణం వైపున కాలువపై రోడ్డు నిర్మాణం చేపట్టడంతో ఆ ప్రాంతంలో ట్రాఫిక్ సమస్యకు పరిష్కారం దొరుకుతుందన్నారు. తిలక్ రోడ్డు- జబ్బార్ లేఅవుట్ 40 అడుగుల మాస్టర్ ప్లాన్ రోడ్ నిర్మాణ పనులను వేగంగా పూర్తి చేస్తామన్నారు. ఎస్ఈ మోహన్, ఎంఈ వెంకట్రామిరెడ్డి, డీఈలు దేవి, గోమతి, డీసీపీ శ్రీనివాసులు రెడ్డి, ఏసీపీ బాలసుబ్రమణ్యం పాల్గొన్నారు.

అకడమిక్ కన్సల్టెంట్ల వైఖరిపై ఉన్నతాధికారుల సీరియస్

తిరుపతి సిటీ: ఎస్వీయూలో పనిచేస్తున్న అకడమిక్ కన్సల్టెంట్లు మూడు రోజులుగా చేస్తున్న నిరసనలు శృతి మించడంపై అధికారులు ఆగ్రహం వ్యక్తం చేశారు. వీసీ, రిజిస్ట్రార్‌ను అసంబద్ధంగా నిందించడం, ఉన్నత విద్యామండలి అధికారులపై మీడియాలో అసత్యాలతో మాట్లాడడంపై వీసీ రాజారెడ్డి శనివారం సాయంత్రం ఓక ప్రకటన విడదల చేశారు. రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన 110 జీవోను కొన్ని వర్సిటీలు అమలు చేశాయని, ఎస్వీయూలో అమలు చేయడానికి పాలక మండలిలో చర్చించేందుకు సిద్ధమవుతున్నట్లు పేర్కొన్నారు. ఈసీ మీటింగ్‌లో పెట్టక ముందే అకడమిక్ కన్సల్టెంట్లు నిరసనకు దిగడం, అసభ్యంగా ప్రవర్తించడం వర్సిటీ నియమాలను ఉల్లంఘించడమేనని తెలియజేశారు. వర్సిటీ ప్రతిష్టను మసకబార్చే చర్యలను సహించబోమని, నియమాలకు విరుద్ధంగా ప్రవర్తిస్తున్న వారిపై తగిన చర్యలు తప్పవని హెచ్చరించారు. సంయమనంతో వారు విధులకు హాజరై, సమస్యలను సామరస్యంగా పరిష్కరించుకోవాలని తెలిపారు.